సాక్షి
కుమురం భీం
శుక్రవారం । 17 । అక్టోబర్ । 2025



విప్లవోద్యమం ఇక చరిత్రే!
విప్లవోద్యమ చరిత్రలో ఉమ్మడి జిల్లాకు ప్రత్యేకత ఉంది. లొంగుబాట్ల నేపథ్యంలో ఇక్కడ మావోల ప్రభావం దాదాపు కనుమరుగైపోయినట్లు భావిస్తున్నారు. 10లో▸



ఆగని బియ్యం దందా
రేషన్ బియ్యం అక్రమ దందా ఆగ డం లేదు. కిలో బియ్యం రూ.12 నుంచి రూ. 20 వరకు కొనుగోలు చేసి మహారాష్ట్రకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. 11లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
33.3 /23.6
వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. అర్ధరాత్రి తర్వాత మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

21న స్పాట్ అడ్మిషన్లు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 21న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ సమన్వయ అధికారి యాదగిరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసిఫాబాద్(బాలుర), రెబ్బెన, సిర్పూర్(టి), కాగజ్‌నగర్(బాలికల) గురుకులాల్లో 6, 7, 8, 9 తరగతుల్లో సీట్లు మిగిలి ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ నెల 21న ఆసిఫాబాద్ గురుకుల పాఠశాలకు బీఎల్‌వీసెట్ హాల్‌టికెట్, కుల, నివాస ధ్రువపత్రాలతో రావాలని సూచించారు. బీఎల్‌వీసెట్ విద్యార్థులు లేకుంటే లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామన్నారు. ఆరో తరగతిలో 12 సీట్లు, ఏడో తరగతిలో 13, ఎనిమిదో తరగతిలో 19, తొమ్మిదో తరగతిలో 25 సీట్లు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు.

యుద్ధ ప్రాతిపదికన సర్వీసులు మంజూరు

ఆసిఫాబాద్‌అర్బన్: రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన వ్యవసాయ సర్వీసులు మంజూరు చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ రాథోడ్ శేషారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలో 2023లో 1,048 సర్వీసులు, 2024లో 1099 సర్వీసులు, 2025లో అక్టోబర్ 16 వరకు 842 సర్వీసులు మంజూరు చేశామని తెలిపారు. 2023తో పోల్చితే 2024లో దాదాపు 51 వ్యవసాయ సర్వీసులు ఎక్కువగా ఇచ్చామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల తరలింపులో రైతులకు ఇబ్బందులు లేకుండా డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో కొత్త వాహనాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రైతులకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు పేర్కొన్నారు.

'గుర్తింపు ఎన్నికలను అడ్డుకుంటున్న యాజమాన్యం'

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూరు పేపరు మిల్లులో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను యాజమాన్యం అడ్డుకుంటుందని బీఆర్‌ఎస్ ట్రేడ్ యూనియన్ విభాగం జిల్లా అధ్యక్షుడు అంబాల ఓదెలు ఆరోపించారు. కాగజ్‌నగర్ పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతేడాది లేబర్ సంఘం అధికారులు గుర్తింపు సంఘం ఎన్నికల ప్రక్రియను ప్రారంభించినా.. మిల్లు యాజమాన్యం ఒత్తిడితో వెనక్కి తగ్గారన్నారు. యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందన్నారు. ఈ నెలలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభించకుంటే బీఆర్‌ఎస్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

మద్యం దుకాణాలకు 212 దరఖాస్తులు

ఆసిఫాబాద్: జిల్లాలో మద్యం దుకాణాల ఏర్పాటుకు ఇప్పటివరకు 212 దరఖాస్తులు వచ్చాయి. గురువారం 46 మంది దరఖాస్తులు సమర్పించారు. ఆసిఫాబాద్ డివిజన్‌లో 144, కాగజ్‌నగర్ డివిజన్‌లో 68 దరఖాస్తులు వచ్చాయ ని అధికారులు వెల్లడించారు. జిల్లాలో 32 మద్యం దుకాణాలు ఏర్పాటు చేయనుండగా, ఏడు దుకాణాలకు ఇప్పటివరకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. ఈ నెల 18 వరకు గడువు ఉంది.

18న జిల్లాస్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఈ నెల 18న జిల్లాస్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ -14, 17 విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. క్రీడాకారులు బోనఫైడ్, ఆధార్ కార్డు, గతేడాది ప్రోగ్రెస్ కార్డుతో ఉదయం 9 గంటలకు పీడీ తిరుపతి, ప్రిన్సిపాల్ మహేశ్వర్‌కు రిపోర్టు చేయాలని సూచించారు.

'బీసీ బంద్‌కు మద్దతు ఇవ్వండి'



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్‌తో ఈ నెల 18న చేపట్టిన తెలంగాణ బంద్‌కు మద్దతు తెలపాలని బీసీ జేఏసీ చైర్మన్ రూప్‌నార్ రమేశ్ కోరారు. ఈ మేరకు గురువారం రాజకీయ పార్టీల నాయకులతోపాటు కుల, వ్యాపార, ఇతర సంఘాల ప్రతినిధులను మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీజేపీ వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, మల్లికార్జున్, కిరాణ మర్చంట్ అధ్యక్షుడు గుండా ప్రమోద్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం పట్టణ సీఐ బాలాజీ వరప్రసాద్‌ను కలిసి బంద్‌కు పోలీసు శాఖ సహకరించాలని కోరారు.

లక్ష్య సాధనపై గురి!

- బెల్లంపల్లి ఏరియాలో బొగ్గు ఉత్పత్తిపై అధిక వర్షాల ప్రభావం
- నష్టాన్ని భర్తీ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసిన యాజమాన్యం
- వర్షాలు తగ్గడంతో ఉత్పత్తిలో వేగం పెంచిన అధికారులు
- లక్ష్యానికి మించి ఓబీ వెలికితీత పనులు

ఐదేళ్లలో బెల్లంపల్లి ఏరియా సాధించిన ఉత్పత్తి వివరాలు(లక్షల టన్నుల్లో)

సంవత్సరం	లక్ష్యం	సాధించింది	శాతం
2021- 22	33.50	24.42	73
2022- 23	35.00	29.20	83
2023- 24	36.50	37.50	103
2024- 25	38.50	37.50	97
2025- 26	16.32	13.70	84

(అక్టోబర్ 14 వరకు)

ఈ ఆర్థిక సంవత్సరంలో నెలల వారీగా ఉత్పత్తి(లక్షల టన్నుల్లో)

నెల	లక్ష్యం	సాధించింది	శాతం
ఏప్రిల్	3.50	2.74	78
మే	3.50	3.04	87
జూన్	2.00	2.62	131
జూలై	2.00	2.00	100
ఆగస్టు	2.00	1.36	68
సెప్టెంబర్	2.00	0.74	37
అక్టోబర్	1.32	1.06	80

(14వ తేదీ వరకు)



ఖైరిగూర ఓసీపీ

రెబ్బెన(ఆసిఫాబాద్): ఓసీపీలపై అధిక వర్షాలు తీవ్ర ప్రభావం చూపడంతో బెల్లంపల్లి ఏరియాలో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. నెలవారీ ఉత్పత్తి సాధన కోసం అధికారులు చర్యలు చేపట్టినా వాతావరణం సహకరించకపోవడంతో ఉత్పత్తి పరంగా నష్టాలు చూడాల్సి వచ్చింది. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో అధికారులు నష్టాన్ని భర్తీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. బెల్లంపల్లి ఏరియాలో ప్రస్తుతం ఖైరిగూర ఓసీపీలో మాత్రమే బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ కొనసాగుతోంది. గోలేటి ఓసీపీ ఇంకా ప్రారంభం కాకపోవడంతో భారమంతా ఖైరిగూర ఓసీపీపైనే ఉంది. జిల్లాలో గతేడాది సెప్టెంబర్ నెలాఖరు వరకు 1,207 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా ఈసారి 1,829 మిల్లీమీటర్లుగా నమోదైంది. గడిచిన రెండు నెలల్లో ఎక్కువ రోజులు వర్షాలు కురవడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఏరియా వార్షిక లక్ష్యంపై ప్రభావం పడింది. సెప్టెంబర్‌లో ఏకధాటిగా కురిసిన వర్షాలతో నెలవారీ ఉత్పత్తి లక్ష్యంలో కేవలం 37 శాతం మాత్రమే సాధించగలిగారు. ప్రధానంగా ఆగస్టు, సెప్టెంబర్ రెండు నెలల్లో నాలుగు లక్షల టన్నులకు కేవలం 2.74 లక్షలు మాత్రమే సాధ్యమైంది. వర్షాలను దృష్టిలో పెట్టుకుని నెలవారీ ఉత్పత్తి లక్ష్యాన్ని తగ్గించినా పూర్తిస్థాయిలో సాధించలేకపోయారు.

ఉత్పత్తి ప్రక్రియలో మార్పులు

20225- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బెల్లంపల్లి ఏరియాకు 35లక్షల టన్నుల ఉత్పత్తిని సాధించాలని యాజమాన్యం లక్ష్యం విధించింది. గత సంవత్సరం వార్షిక లక్ష్య సాధనలో అడుగు దూరంలో బెల్లంపల్లి ఏరియా నిలిచింది. దీంతో ఈసారి వందశాతం ఉత్పత్తి సాధించాలని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా నెలవారీ లక్ష్యాలను నిర్దేశించుకుంటూ ఉత్పత్తి ప్రక్రియలో మార్పులు చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. వర్షాలు ఉత్పత్తి పరంగా ఏరియాను కుదేలు చేసినా సవాళ్లను అధిగమించేందుకు చర్యలు చేపడుతున్నారు. అక్టోబర్ 14 నాటికి బెల్లంపల్లి ఏరియా వార్షిక ఉత్పత్తి సాధనలో 84 శాతంలో ఉంది. వర్షాలు తగ్గడంతో ఉత్పత్తిలో వేగం పెంచుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో చివరి నాలుగు నెలలు కీలకంగా మారనున్నాయి. ప్రస్తుతం ఏరియా రోజువారీ ఉత్పత్తి లక్ష్యం 10వేల టన్నులు ఉండగా డిసెంబర్ నుంచి 12వేల వరకు పెంచేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. అదనపు ఉత్పత్తి లక్ష్యం నిర్ణయించడం ద్వారా వర్షాకాలంలో కోల్పోయిన ఉత్పత్తి నష్టాన్ని తిరిగి సాధించనున్నారు.

వేగంగా ఓబీ వెలికితీత

ఓపెన్ కాస్ట్‌ల్లో బొగ్గు ఉత్పత్తి అనుకున్న స్థాయిలో జరగాలంటే అందుకు అవసరమైన బొగ్గు బెంచీలు అందుబాటులో ఉండాలి. ఓబీ పనులు అనుకూలంగా సాగాలి. అనుకున్న రీతిలో ఓబీ తీసినప్పుడే బొగ్గు బెంచ్‌లు సిద్ధంగా ఉంటాయి. సింగరేణిలోనే అతిపెద్ద ఏరియా అయిన శ్రీరాంపూర్ ఓసీపీలో ఓబీ వెలికితీత పనులు దక్కించుకున్న కాంట్రాక్ట్ సంస్థలు పనులను మధ్యలోనే వదిలేస్తూ చేతులెత్తేశాయి. దీంతో శ్రీరాంపూర్ ఓసీపీ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. కానీ బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూర ఓసీపీలో ఓబీ వెలికితీస్తున్న కాంట్రాక్టు సంస్థ రోజు వారీ లక్ష్యానికి మించి ఓబీ వెలికితీస్తోంది. ప్రస్తుతం ఓబీ రోజువారీ లక్ష్యం 1.2లక్షల క్యూబిక్ మీటర్లు ఉండగా.. కాంట్రాక్ట్ సంస్థ రోజుకు 1.30 లక్షల క్యూబిక్ మీటర్ల వరకు ఓబీ తొలగిస్తోంది. దీంతో ఏరియాలో డిసెంబర్ నుంచి వందశాతానికి మించి బొగ్గు ఉత్పత్తి చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. యంత్రాల పని గంటలను పెంచడం, రోజువారీ వార్షిక లక్ష్యాన్ని పెంచడం, అధికారులు, ఉద్యోగులు సమష్టిగా పని చేయడం వంటి చర్యలు చేపడుతున్నారు.

వందశాతం లక్ష్యం సాధిస్తాం



గతేడాదితో పోల్చితే ఈసారి ఏరియాలో అధిక వర్షపాతం నమోదైంది. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సగం ఉత్పత్తిని కూడా సాధించలేకపోయాం. అయినా ఈ ఆర్థిక సంవత్సరంలో ఏరియాకు నిర్దేశించిన లక్ష్యం వందశాతం సాధిస్తాం. ఏరియాకు ఈసారి 35 లక్షల టన్నుల లక్ష్యం ఉంది. అక్టోబర్ 14 వరకు ఏరియా 16.32 లక్షల టన్నులకు 13.66 లక్షల టన్నులు సాధించి 84శాతంలో ఉన్నాం. ప్రస్తుతం వర్షాలు తగ్గడంతో ఉత్పత్తి ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం.

– విజయ భాస్కర్‌రెడ్డి, జనరల్ మేనేజర్, బెల్లంపల్లి ఏరియా

నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: నూతన ఓటర్లకు తపాలాశాఖ ద్వారా గుర్తింపు కార్డులు అందించాలని రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, సహాయ ఎన్నికల అధికారులు, తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి మాట్లాడుతూ ఓటరు జాబితాలో వందేళ్లు కలిగిన ఓటర్లను గుర్తించి, వారి వయస్సుకు తగిన ఆధారాలు సమర్పించాలని ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని, ఫారం 6, 7, 8 దరఖాస్తులను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో నూతనంగా ఓటరుగా నమోదైన వారికి తపాలాశాఖ ద్వారా ఓటరు కార్డులు పంపిస్తున్నామని తెలిపారు. వందేళ్లకు పైబడిన వారిని గుర్తిస్తామన్నారు. సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లోని బూత్‌స్థాయి అధికారులకు గుర్తింపు కార్డులు అందించేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. సమావేశంలో కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ జాస్తిన్ జోల్, ఎన్నికల పర్యవేక్షకుడు శ్యాంలాల్, అధికారులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషక మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పెంటుబాయి కూరగాయలు, పోషకాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సువర్ణ, వనీత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు పాతర!

- అనుమతులు లేకుండానే బాణాసంచా దుకాణాల ఏర్పాటు



కాగజ్‌నగర్‌లోని వినయ్‌గార్డెన్‌లో ఏర్పాటు చేసిన దుకాణాలు

కాగజ్‌నగర్‌టౌన్: దీపావళి పండుగ సమీపిస్తోంది. ఓ వైపు పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్ కావడంతోపాటు దీపావళి పండుగ ఉండటంతో కాగజ్‌నగర్ పట్టణంలో నిత్యావసరాల మాటున ఇప్పటికే పెద్ద ఎత్తున బాణాసంచా నిల్వలు చేరుకున్నట్లు సమాచా రం. అయితే విక్రయదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం లైసెన్స్‌లు పొందకుండానే తాత్కాలికంగా ఎన్‌వోసీ లెటర్ తీసుకుని పట్టణంలో దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. దుకాణాల ఏర్పాటుకు రెవె న్యూ, వాణిజ్య పన్నుల శాఖ, పోలీసుల అనుమతులు తీసుకోలేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భా రీగా గండి పడుతోంది. అధిక ధరలకు టపాసులు విక్రయించి సొమ్ము చేసుకునేలా వ్యాపారులు సిండికేట్ అయినట్లు తెలుస్తోంది.

రెండు శాఖల నుంచి ఎన్‌వోసీ..

దీపావళి పండుగకు బాణాసంచా విక్రయించేందుకు పట్టణంలోని వినయ్‌గార్డెన్‌లో ప్రత్యేక స్టాల్స్ ఏ ర్పాటు చేస్తున్నారు. బురదగూడ గ్రామ అగ్నిమాప క శాఖ, పంచాయతీ నుంచి ఏడు దుకాణాలకు ఇప్పటివరకు కేవలం ఎన్‌వోసీ లెటర్ మాత్రమే తీసుకున్నారు. షాపులు ఇరుకుగా ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. దుకాణాల మధ్య దూరం పెంచి ఫైర్ అండ్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తే ప్రమాదాల నుంచి రక్షణ పొందేందుకు ఆస్కారం ఉంటుంది. రెవెన్యూ, పోలీసు అధికారులు తనిఖీ చేసి నిబంధనల ప్రకారం ఏర్పాట్లు జరుగుతున్నాయా లేదా అని పరిశీలించాలి. లైసెన్సులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

నిబంధనలు పాటించాలి

ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా బాణాసంచా నిల్వలు ఉంచినా, విక్రయించినా చర్యలు తీసుకుంటాం. సేఫ్టీ నిబంధనల ప్రకారమే దుకాణాలు ఏ ర్పాటు చేసుకోవాలి. షాపుల మధ్య కనీసం మూడు మీటర్ల దూరం ఉండాలి. నీరు, ఇసుక, అగ్నిమాపక సిలిండర్ అందుబాటులో ఉంచాలి.

– భీమయ్య, ఫైర్ ఆఫీసర్, కాగజ్‌నగర్

భవితవ్యం.. ప్రశ్నార్థకం

- శిథిలావస్థకు చేరిన సిర్పూర్(టి) సాంఘిక సంక్షేమ గురుకులం
- నెలలు గడుస్తున్నా ప్రారంభంకాని మరమ్మతులు
- ఇతర పాఠశాలల్లో విద్యార్థుల సర్దుబాటు
- సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన



సిర్పూర్(టి)లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థంగా మారింది. భవన సముదాయాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో వర్షాకాలంలో జూలై 29న ఖాళీ చేయించి విద్యార్థులను ఇళ్లకు పంపించారు. అనంతరం వారిని ఇతర గురుకులాల్లో సర్దుబాటు చేశారు. నెలలు గడుస్తున్నా ఇప్పటికీ గురుకుల భవనానికి మరమ్మతులు చేపట్టలేదు. తాత్కాలిక భవనాల కోసం అధికారులు గాలిస్తున్నారు. భవనం ఎంపిక ప్రక్రియ తుదిదశకు చేరుకోలేదు. దీంతో విద్యార్థుల భవిష్యత్తుపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఐదు గురుకులాలకు విద్యార్థులు

సిర్పూర్(టి) గురుకుల పాఠశాల, కళాశాలలో మొత్తం 640 మంది విద్యార్థులకు పరిమితి ఉండగా ప్రస్తుతం 490 మంది చదువుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో 490 విద్యార్థులను ఆసిఫాబాద్, బెల్లంపల్లి, కాసిపేట, జైపూర్‌తోపాటు కోరుట్లలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలకు తరలించారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారు. మొదట భారీ వర్షాలతో విద్యార్థులను ఇళ్లకు పంపించారు. ఆ తర్వాత ఇతర గురుకులాలకు పంపించడంతో విద్యా సంవత్సరం మధ్యలో ఇబ్బందులు ఎదురయ్యాయి. అధికారులు తాత్కాలిక ఏర్పాట్ల కోసం కౌటాల మండలం విజయనగరం గ్రామంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాల భవనాన్ని పరిశీలించారు. భవనం మార్పునకు చర్యలు తీసుకుంటున్నామని విద్యాశాఖ అధికారులు చెబుతుండగా, తమకు సమాచారం లేదని గురుకులాల అధికారులు చెబుతున్నారు.

తల్లిదండ్రులు, విద్యార్థుల ఆందోళనలు

దసరా సెలవుల అనంతరం ఇతర గురుకులాలకు వెళ్లేందుకు విద్యార్థులు నిరాకరించారు. అక్కడ వసతులు, సరిపడా గదులు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మరమ్మతులు చేపట్టి సిర్పూర్(టి)లోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఇటీవల విద్యార్థులు, తల్లిదండ్రులు సిర్పూర్(టి)-కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. సుమారు ఐదు గంటలపాటు ఆందోళనలు నిర్వహించారు. అలాగే తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి సుమారు వంద మంది విద్యార్థుల తల్లిదండ్రులు వెళ్లి వినతిపత్రం అందించారు. కలెక్టర్‌కు సమస్యను విన్నవించారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



రహదారిపై ధర్నా చేస్తున్న విద్యార్థులు(ఫైల్)

సౌకర్యాలు లేక ఇబ్బందులు



సిర్పూర్(టి) గురుకులానికి చెందిన విద్యార్థులను ఐదు గురుకులాలకు తరలించారు. ఆయా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, సరిపడా గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే అధికార యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోవాలి.

– సిద్దాల లక్ష్మణ్, తల్లిదండ్రుల కమిటీ సభ్యుడు

సిర్పూర్(టి)లోనే కొనసాగించాలి



గురుకుల పాఠశాలను సిర్పూర్(టి)లోనే కొనసాగించాలి. భవనాల మరమ్మతులకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి తక్షణమే పనులు ప్రారంభించాలి. నిర్లక్ష్యం వహిస్తే విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోయే అవకాశం ఉంది.

– ఇప్ప స్వామి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్

చర్యలు తీసుకుంటాం

సిర్పూర్(టి) సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఖాళీ చేయించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భవనాల మరమ్మతులు చేపడతాం. భవనంపై కప్పుపై రేకులతో నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

– యాదగిరి, సాంఘిక సంక్షేమ గురుకులాల డీసీవో

ఐటీడీఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న దినసరి, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో గురువారం స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సవ్యసాచి ఘోష్‌కు వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సుమారు 30 ఏళ్లుగా సేవలందిస్తున్నారని తెలిపారు. వీరంతా గిరిజనులే అయినా ఇప్పటివరకు ఉద్యోగ భద్రత కల్పించకపోవడం బాధాకరమన్నారు. సకాలంలో వేతనాలు అందించకపోవడంతో ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

అటవీ ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు వద్దు



మాట్లాడుతున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్: అటవీ ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయవద్దని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. వన్యప్రాణుల సంరక్షణ చర్యల్లో భాగంగా వైల్డ్ లైఫ్, టాస్క్‌ఫోర్స్ టీం, విద్యుత్ అధికారులతో గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టిబ్రేవాల్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ అనుమతి లేకుండా అటవీప్రాంతంలో విద్యుత్ వైర్లు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రిజర్వ్ ఫారెస్టులో ఉన్న విద్యుత్ వైర్లు తొలగించి, రెవెన్యూ భూముల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనుమతి లేకుండా వేస్తున్న తీగలతో అటవీ జంతువులతోపాటు మనుషులు కూడా మృత్యువాత పడుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో అటవీ మండల అధికారి సుశాంత్ సుఖ్‌దేవ్, డీఎస్పీ వహిదుద్దీన్, అటవీ టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు ముసవీర్, సద్దాం, సీఐలు రవీందర్, రాణాప్రతాప్, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ శేషారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సరిహద్దు ప్రాంతాల్లో పటిష్ట భద్రత

- ఎస్పీ కాంతిలాల్ పాటిల్

కౌటాల(సిర్పూర్): అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా కౌటాల సర్కిల్ కార్యాలయాన్ని గురువారం సందర్శించారు. కార్యాలయ రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేసులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. గ్రేవ్ కేసులను నాణ్యమైన దర్యాప్తు చేసి త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. హత్యలు, డౌరీ డెత్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నేరాలను అదుపునకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నేరాలు ఎక్కువ జరుగుతున్న ప్రాంతాలను క్రైమ్ హాట్‌స్పాట్లుగా గుర్తించాలన్నారు. గంజాయి, ఇతర అక్రమాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన వెంట కాగజ్‌నగర్ డీఎస్పీ వహిద్దుదీన్, సీఐ సంతోష్‌కుమార్, ఎస్సైలు చంద్రశేఖర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

క్లుప్తంగా

స్వగ్రామం చేరిన మృతదేహం


గోపు భూమయ్య (ఫైల్)

సర్సాపూర్(జి): ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశం దుబాయ్ వెళ్లిన మండలంలోని తిమ్మాపూర్ (జి) గ్రామానికి చెందిన గోపు భూమయ్య (42) నెల రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందగా గురువారం మృతదేహం స్వగ్రామానికి చేరింది. గ్రామానికి చెందిన గోపు భూమయ్య దుబాయ్‌లోని సోనాపూర్ ప్రాంతంలో గల సీఆర్‌సీ కంపెనీలో ఏడాదిన్నరగా కార్మికుడిగా పనిచేస్తున్నాడు. నెల రోజుల క్రి తం గుండెపోటుతో మృతి చెందగా యూఏఈ హెల్పింగ్ ఆర్గనైజేషన్ సంస్థ సహకారంతో బొమ్మ ప్రవీణ్, బొడ్డుపల్లి రాము, గన్నారపు హన్మాండ్లు, శ్రీనివాస్ కంపెనీ యాజమాన్యం, పీఆర్వోలతో మాట్లాడి మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించే ఏర్పాట్లు చేశారు. గురువారం స్వగ్రామానికి మృతదేహం చేరడంతో బాధిత కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఇచ్చోడ: మండలంలోని అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకు తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కొంతమంది ట్రాక్టర్ యజమానులు ఇసుకను తరలించి మండల కేంద్రంలో విక్రయిస్తున్నట్లు తెలిసింది. అటవీశాఖ అధికారి పుండలిక్ రెండు రోజుల క్రితం ట్రాక్టర్‌ను పట్టుకోగా గురువారం టైగర్‌జోన్ అధికారులు మరో మూడు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఈ మేరకే కేసులు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేశారు.

బాలిక అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: తలమడుగు మండలంలోని దహెగాంలో అత్తాగారి ఊర్లో నివాసం ఉంటున్న మహారాష్ట్రకు చెందిన ఆకాష్ కూతురు అదృశ్యమైనట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఈ నెల 13న భార్యభర్తలు కూలీ పనులకు వెళ్లగా కూతురు కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసును తలమడుగు పోలీసు స్టేషన్‌కు బదిలీ చేయనున్నట్లు వివరించారు.

కాసిపేట గని ఎదుట ఖాళీ బిందెలతో నిరసన


నిరసన తెలుపుతున్న మహిళలు

కాసిపేట: నీటిసమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్ ఆధ్వర్యంలో మందమర్రి ఏరియా కాసిపేట గని ఎదుట గురువారం మహిళలు, గ్రామస్తులు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. మండలంలోని ముత్యంపల్లి, చిన్నధర్మారం, కాసిపేట గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. అధికారులకు ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, నిధుల కొరత అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదనపు మేనేజర్ నిఖిల్ అయ్యర్ మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు బాకీ కిరణ్, ప్రసన్న, మహిళలు పోసు, లచ్చక్క, కవిత, పద్మ, మహేశ్వరి, లక్ష్మి, యువకులు పాల్గొన్నారు.

విప్లవోద్యమం ఇక చరిత్రే!

- ఇప్పటికే ఎంతోమంది ఎన్‌కౌంటర్
- మరికొందరు లొంగుబాటు..
- మావోల శకం ముగిసినట్లే..?

బెల్లంపల్లి: పూర్వ పీపుల్స్‌వార్ ప్రస్తుత మావోయిస్టుపార్టీ విప్లవోద్యమ చరిత్రలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఎంతో ప్రత్యేకత ఉంది. విప్లవ పంథాకు ఆకర్షితులైన ఎందరో యువతీ, యువకులు సమసమాజ స్థాపన కోసం నాలుగున్నర దశాబ్దాల క్రితం అడవి బాట పట్టారు. సాయుధ పోరాటం ద్వారానే రాజ్యాధికారం సాధ్యమని ధృఢంగా నమ్మి తల్లిదండ్రులు, తోబుట్టువులను వదిలి విప్లవమార్గం అనుసరించారు. నిరుపేద, కార్మిక, కర్షక కుటుంబాల నుంచి విద్యావంతులు, యువకులు ప్రాణత్యాగాలకు వెరవకుండా తుపాకి పోరాటంలో భాగస్వాములయ్యారు. అడవుల జిల్లా నలుమూలల పోరాట బీజాలు నాటి ఒకానొక దశలో సమాంతరంగా కార్యకలాపాలు సాగించారు. మందుపాతరలు పేల్చి పోలీసులను హతమార్చారు. కరువు దాడులు చేశారు. పోలీస్‌స్టేషన్లను టార్గెట్‌గా చేసి ఆయుధాల అపహరణకు సిద్ధపడ్డారు. నక్సలైట్‌ల ఏరివేతలో భాగంగా పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో ఎందరో అసువులు బాశారు. పచ్చటి అడవులు నెత్తుటేరులతో ఎరుపెక్కాయి. 1980 దశకం నుంచి 1995 వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విప్లవ జ్వాలలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. ఆతర్వాత పోలీసులు వ్యూహాత్మకంగా పట్టుసాధించి పదుల సంఖ్యలో నక్సలైట్లను ఎన్‌కౌంటర్‌లలో హతమార్చారు.

జగిత్యాల జైత్రయాత్ర వెల్లువలో...

పీపుల్స్‌వార్ వ్యవస్థాపక ఆద్యుల్లో ముఖ్యుడైన కొండపల్లి సీతారామయ్య సారథ్యంలో జగిత్యాల జైత్రయాత్ర జరిగింది. ఆ పరిణామాల క్రమంలో 1978–79 ప్రాంతంలో బెల్లంపల్లికి చెందిన గజ్జెల గంగారాం, పెద్ది శంకర్, 1980, 81ప్రాంతంలో కటకం సుదర్శన్ విప్లవ భావజాలానికి ఆకర్షితులై అమరుడు నల్లా ఆదిరెడ్డి మార్గదర్శకంలో పీపుల్స్‌వార్ గ్రూప్‌ను విస్తరించారు. వీరి నేతృత్వంలో విప్లవ కార్యకలాపాలు ముమ్మరంగా సాగాయి. అడవుల జిల్లా అంతటా పీపుల్స్‌వార్ వేళ్లానుకుని బలీయమైన శక్తిగా రూపాంతరం చెందింది. విప్లవ పోరాటాన్ని తీవ్రతరం చేయడంలో బెల్లంపల్లి, మందమర్రి, చెన్నూర్, ఆసిఫాబాద్, నిర్మల్, బోథ్, ఆదిలాబాద్, సిర్పూర్, తదితర ప్రాంతాలకు చెందిన ఎందరో కీలక భూమిక పోషించారు.

అమరత్వం... లొంగుబాటు...

విప్లవోద్యమంలో బెల్లంపల్లికి చెందిన పెద్ది శంకర్, గజ్జెల గంగారాం తొలి అమరులుగా చరిత్ర కెక్కారు. మొన్నటి జాడి వెంకటి వరకు విప్లవ ఆశయం సిద్ధించకుండానే నెత్తుటి బాటలో అనేకమంది నేలరాలారు. వ్యక్తిగత బలహీనతలు, అనారోగ్య సమస్యలు, పోలీసు నిర్బంధాన్ని తట్టుకోలేక వందలాది మంది జనజీవన స్రవంతిలో కలిశారు. పక్షం రోజుల క్రితం దండకారణ్యంలో పనిచేస్తున్న చెన్నూర్ ప్రాంతానికి చెందిన మావోయిస్టు దంపతులు ఆత్రం లచ్చయ్య, పద్మ పోలీసుల ఎదుట లొంగిపోయారు. తాజాగా దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ (డీకేఎస్‌జెడ్‌సీ) సెక్రెటరీగా పనిచేసిన బెల్లంపల్లికి చెందిన సలాకుల సరోజ ఉరఫ్ లత ఉరఫ్ దీప, ఆమె భర్త నిర్మల్ జిల్లా కూచన్‌పల్లి వాసి దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ ఇన్‌చార్జి ఇంద్రి. మోహన్‌రెడ్డి ఉరఫ్ వివేక్ గడ్చిరోలిలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర పడ్నవీస్‌కు ఆయుధాన్ని అప్పగించి విప్లవ జీవితానికి ముగింపు పలికారు. వీరి లొంగుబాటు నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో మావోయిస్టుల ప్రభావం దాదాపు కనుమరుగైపోయినట్లేనని చర్చించుకుంటున్నారు.

అజ్ఞాతంలో ఉన్నది ఇంకెందరు?

సరోజ, మోహన్‌రెడ్డి దంపతుల లొంగుబాటు అనంతరం మావోయిస్టు పార్టీ విప్లవోద్యమంలో ప్రస్తుతం అజ్ఞాతంలో ఎందరున్నారనే చర్చ జరుగుతోంది. దండకారణ్యం కేంద్రంగా పని చేస్తున్న మావోయిస్టుపార్టీ ముఖ్య నాయకుడు, సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) కార్యదర్శిగా వ్యవహరిస్తున్న మందమర్రికి చెందిన బండి ప్రకాష్ (ఇతను కూడా ప్రభుత్వానికి లొంగిపోతారనే ప్రచారం జరుగుతోంది), మరో మావోయిస్టు అగ్రనాయకుడు కోటపల్లి మండలం బబ్బెర చెలక గ్రామవాసి మూల దేవేందర్ రెడ్డి, బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామానికి చెందిన జాడి పుష్ప, బెల్లంపల్లి శాంతిఖని బస్తీకి చెందిన కృష్ణ, మరో యువకుడితో పాటు మరి కొంతమంది విప్లవ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. వీరు మినహా ఉమ్మడి జిల్లాలో మరెవరూ అజ్ఞాతంలో లేనట్లుగా మాజీ మావోయిస్టులు, విప్లవ సానుభూతి పరులు పేర్కొంటున్నారు. పోలీసు రికార్డులకెక్కిన మావోయిస్టుల్లో దండకారణ్యంలో పనిచేస్తున్న వారు తప్పా ప్రస్తుతం భౌతికంగా ఏ ఒక్కరు లేనట్లుగా చెబుతున్నారు. ఈక్రమంలో నాలుగున్నర దశాబ్దాల పోరాట వారసత్వం కలిగిన ఉమ్మడి జిల్లా విప్లవ ప్రస్థానం ఇక చరిత్ర పుటలకు పరిమితం కానుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొత్తగా మావోయిస్టు పార్టీలో రిక్రూట్‌మెంట్ నిలిచి పోవడంతో ఉద్యమ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.

ఉద్యోగ వేట ఇక సులభతరం

- నిరుద్యోగుల కోసం 'డీట్' యాప్‌ను ఏర్పాటు చేసిన ప్రభుత్వం



డీట్ వెబ్‌సైట్

బోథ్: డిజిటల్ యుగంలో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతికతతో కూడిన 'డీట్' (డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎకేస్చేంజ్ ఆఫ్ తెలంగాణ) యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. నిరుద్యోగులు, ప్రైవేటు రంగ సంస్థల మధ్య ప్రత్యక్ష వారధిగా ఈ యాప్ పనిచేయనుంది.

పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో పర్యవేక్షణ

పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను రూపొందించారు. విద్యా సంస్థలు, ప్రభుత్వ శాఖలు, ప్రైవేటు సంస్థల సమన్వయంతో ఇది పర్యవేక్షించబడుతుంది. తద్వారా, అభ్యర్థులు తమ అర్హతలకు తగిన ప్రైవేటు రంగ ఉద్యోగ అవకాశాలను సులభంగా పొందేందుకు మార్గం సుగమం అవుతుంది. పరిశ్రమలు, నిరుద్యోగులు ఈ యాప్‌లో నమోదు చేసుకుంటే కంపెనీలు తమకు అవసరమైన, స్కిల్ ఉన్న వారికి సందేశాన్ని పంపిస్తారు. వందల కంపెనీలన్నీ ఒకే చోట ఉండటంతో నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉటుంది.

అర్హతలు, నైపుణ్యాల ఆధారంగా ఉద్యోగాలు

డీట్ యాప్ ద్వారా పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, ఆపై చదివిన అభ్యర్థులు ప్రయోజనం పొందవచ్చు. వారి విద్యార్హత, నైపుణ్యాలు, అనుభవం ఆధారంగా కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఈ వేదిక ఉపయోగపడుతుంది. డిగ్రీ చదువుతున్న అభ్యర్థులకు కూడా నమోదు చేసుకునే అవకాశం కల్పించడం అదనపు విశేషం. ఫార్మా, ఇండస్ట్రియల్, బీపీవో, కస్టమర్ ఎగ్జిక్యూటివ్ సపోర్ట్, బిజినెస్ డెవలప్‌మెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్‌తో పాటు అనేక ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి.

- నిరుద్యోగులు, ఉద్యోగాలు కల్పించే ఔత్సాహిక కంపెనీలు ఈ యాప్‌లో నమోదు చేసుకోవచ్చు.
- కంపెనీ నిర్వాహకులు, యాప్‌లో నమోదైన అభ్యర్థుల విద్య, నైపుణ్య వివరాలను పరిశీలించి, నేరుగా వారిని సంప్రదిస్తారు.
- కంపెనీల నియమావళిని బట్టి రాత లేదా మౌఖిక పరీక్షలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారు. ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయానికి ఇందులో అవకాశం ఉండదు.

నమోదు విధానం

- నిరుద్యోగులు తమ పూర్తి వివరాలను డీట్ యాప్‌లో లేదా అధికారిక వెబ్‌సైట్ www.deet.telangana.gov.in లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.
- ఫోన్ నంబర్‌కు వచ్చే ఓటీపీ ద్వారా యాప్‌ను తెరవాలి.
- విద్యార్హతలు, సాంకేతిక నైపుణ్యాలు, అనుభవం, ఇంటర్న్‌షిప్‌ల వివరాలు నమోదు చేయాలి.
- పార్ట్‌టైమ్, ఫుల్‌టైమ్, అప్రెంటిస్‌షిప్‌లలో దేని కోసం అన్వేషిస్తున్నారో, ఏ రంగంలో ఉద్యోగం కావాలో స్పష్టం చేయాలి.
- విద్యార్హత పత్రాలను యాప్‌లో అప్‌లోడ్ చేయడంతో నమోదు ప్రక్రియ పూర్తవుతుంది.

భార్యను కడతేర్చిన భర్త

- మద్యం తాగొద్దని మందలించిందని గొడ్డలితో నరికి హత్య
- ఆదిలాబాద్ జిల్లా సీతాగోందిలో ఘటన


రక్తపు మడుగులో లక్ష్మీబాయి మృతదేహం

గుడిహత్నూర్: మద్యం తాగొద్దని మందలించిన భార్యను గొడ్డలితో నరికి చంపిన సంఘటన మండలంలో సంచలనం సృష్టించింది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సీతాగోంది గ్రామానికి చెందిన సిడాం సంతోష్, లక్ష్మీబాయి (35) దంపతులు కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. సంతోష్ మద్యానికి బానిసై తరచూ ఇంట్లో భార్యతో గొడవపడేవాడు. గురువారం ఉదయం సైతం మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. తాగి మోటార్ సైకిల్ నడుపొద్దని లక్ష్మీబాయి మందలించింది. మద్యం మత్తులో ఉన్న సంతోష్ కోపంతో ఇంట్లో ఉన్న గొడ్డలితో ఆమె చెంప భాగంలో బలంగా కొట్టడంతో సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయింది. నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తన భార్యను హత్య చేశానని పోలీసులకు లొంగిపోయాడు. సీఐ బండారి రాజు, ఎస్సై శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై అన్వర్

లక్సెట్టిపేట: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గోపతి సురేశ్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఎల్లారం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ వావిలాల రమేశ్ (39) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. బుధవారం మంచిర్యాలకు వెళ్లి అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. మద్యం మత్తులో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుని భార్య రజిని ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని వివాహిత..


మాధవి (ఫైల్)

బాసర: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సీఐ సాయికుమార్ తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రలోని హజిని గ్రామానికి చెందిన మాధవి (23)కి బాసర మండలంలోని దౌడాపూర్ గ్రామానికి చెందిన కర్మానే మనోజ్‌తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ప్రస్తుతం వారికి ఇద్దరు పిల్లలు సంతానం. కొంతకాలంగా మనోజ్ మద్యం సేవించి ఇంటికి వచ్చి అదనపు కట్నం తేవాలని మాధవిని మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురిచేసేవాడు. దీంతో మనస్తాపానికి గురైన మహిళ బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త వేధింపులతోనే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి రాంచందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి..


బుచ్చన్న (ఫైల్)

లక్ష్మణచాంద: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఒడ్డెపెల్లి గ్రామానికి చెందిన పల్లపు బుచ్చన్న (52) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురై ఈ నెల 13న గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


సుధాకర్ (ఫైల్)

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గద్దెరాగిడిలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తిమ్మాపూర్ గ్రామానికి చెందిన భీమా సుధాకర్ (65) మృతి చెందాడు. గద్దెరాగిడిలోని ఓ కిరాణ దుకాణానికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆటో వేగంగా ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని వెంటనే మంచిర్యాల ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గుర్తు తెలియని వ్యక్తి..


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


నేరడిగొండ: మండలంలోని బుద్దికొండ గ్రామ సమీపంలో స్థానిక రైతు నవీన్ రెడ్డికి చెందిన వ్యవసాయ క్షేత్రంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి (45) విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్సై ఇమ్రాన్ ఖాన్ తెలిపారు. గ్రామస్తుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు తెల్లటి చొక్కా, జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపాడు. కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. వివరాలు తెలిసిన వారు 8712659947 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

వేర్వేరు చోట్ల ఇద్దరికి పాము కాటు


వైశాలికి చికిత్స చేస్తున్న ఈఎంటీ అనిల్ ➤

బేల: మండలంలోని సిర్సన్న, జూనోని రెవెన్యూ గ్రామ శివారుల్లోని పొలాల్లో గురువారం ఇద్దరు రైతులు పాముకాటుకు గురయ్యారు. సిర్సన్న గ్రామ శివారులోని పొలంలో పనిచేస్తున్న బబన్‌కు, జూనోని గ్రామ శివారులోని పొలంలో పనిచేస్తున్న వైశాలిని వేర్వేరుగా పాములు కాటేశాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో ఈఎంటీ అనిల్, పైలెట్ అర్షద్‌ఖాన్ బాధితులకు ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు.

కడెం ప్రాజెక్ట్ గేటు ఎత్తివేత


కడెం ప్రాజెక్ట్

కడెం: కడెం ప్రాజెక్టుకు గురువారం రాత్రి 1000 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో రావడంతో ఇరిగేషన్ అధికారులు ఒక వరద గేటు ఎత్తి 4,178 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఇన్‌ఫ్లో పెరిగితే మరిన్ని గేట్లు ఎత్తనున్నట్లు అధికారులు వెల్లడించారు.

నిజాయతీ చాటుకున్న సాయితేజ


బ్యాగును అప్పగిస్తున్న పోలీసులు

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ గ్రామానికి చెందిన గొడిసెల సాయితేజగౌడ్ దొరికిన బ్యాగును లోకేశ్వరం పోలీసులకు అప్పగించి నిజాయతీ చాటుకున్నాడు. బుధవారం నిజామాబాద్ నుంచి పుస్పూర్‌కు బైక్‌పై వస్తున్న సాయితేజకు నందిపేట్ మండలం పలుగుగుట్ట సమీపంలో ఓ హ్యాండ్‌బ్యాగు దొరికింది. అందులో సెల్‌ఫోన్, రెండు గ్రాముల బంగారం, ఆధార్ కార్డు ఉంది. ఆధార్ ఆధారంగా నందిపేట్ మండల కేంద్రానికి చెందిన ప్రవళికగా గుర్తించి లోకేశ్వరం పోలీసులకు బ్యాగ్‌ను అప్పగించాడు. సుమారు రూ.40 వేల విలువైన వస్తువులను అప్పగించిన యువకుడిని పోలీసులు అభినందించారు. గురువారం పోలీసులు బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించి బ్యాగును అప్పగించారు.

డబ్బులు దండుకున్న మధ్యవర్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: మధ్యవర్తిగా వ్యవహరిస్తూ కోర్టులో తీర్పు అనుకూలంగా వచ్చేలా చూస్తానని, పెద్దల సమక్షంలో సెటిల్‌మెంట్ చేస్తానని డబ్బులు వసూలు చేసిన నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కె.నాగరాజు తెలిపారు. హైకోర్టులో జడ్జీలు, న్యాయవాదులు పరిచయం ఉన్నారని నమ్మబలికి బాధితుల నుంచి రూ.3 లక్షల 50వేలు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షీద్ నగర్‌కు చెందిన ఫిర్యాదుదారు కుమారుడు, కోడలు మధ్య గొడవలు ఉన్నాయి. మధ్యవర్తిగా పరిచయం ఉన్న జైనూర్ మండలంలోని బూసిమెట్టుకు చెందిన జాడే రవీందర్ బాధితులను నమ్మబలికి అందినకాడికి దండుకున్నాడు. తీసుకున్న డబ్బులు ఇవ్వకుండా తిప్పుకుంటున్నాడు. మొదట రూ.3లక్షలు ఇవ్వగా ఆ తర్వాత కేసు నమోదు చేయిస్తానని బెదిరించి మరో రూ.50 వేలు తీసుకున్నాడు. డబ్బులు అడిగితే బెదిరింపులకు పాల్పడడంతో బాధితురాలు గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

42 కిలోల గంజాయి దహనం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో నమోదైన 18 కేసుల్లో పట్టుబడిన 42 కిలోల గంజాయిని గంజాయి డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో దహనం చేశారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లిలోని శ్రీ మెడికేర్ సర్వీసెస్ సెంటర్‌లో గురువారం గంజాయి డిస్పోజల్ చేశారు. ఇందులో 22 కిలోల గంజాయి మొక్కలు, 20 కిలోల ఎండు గంజాయిని దహనం చేశారు. అడిషనల్ ఎస్పీ సురేందర్ రావు, డీసీఆర్‌బీ సీఐ హకీమ్ ఈ ప్రక్రియను పరిశీలించారు.

హోరాహోరీగా బ్యాడ్మింటన్ పోటీలు


క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ముఖేష్‌గౌడ్

మంచిర్యాలఅర్బన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంచిర్యాల క్లబ్‌లో గురువారం నిర్వహించిన అండర్–14, 17, 19 బాలబాలికల జోనల్ స్థాయి ఎంపిక పోటీలు హోరాహోరీగా సాగాయి. బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముఖేష్‌గౌడ్ పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 120 మంది క్రీడాకారులు పాల్గొనగా ఒక్కో గ్రూపు నుంచి ఐదుగురు చొప్పున 30 మంది ఎంపికయ్యారు. అండర్–14 హైదరాబాద్, అండర్–17 మేడ్చల్, అండర్–19 మహబూబాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి యాకూబ్ తెలిపారు. కార్యక్రమంలో అండర్–19 ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బాబురావు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పులూరి సుధాకర్, జెడ్పీబాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండి రమేశ్, ఫిజికల్ డైరెక్టర్ రేణి రాజయ్య, కుమురంభీం జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

గెలిచిన సంఘాలు విఫలం

- సీఐటీయూ అధ్యక్షుడు టీ.రాజారెడ్డి


మాట్లాడుతున్న రాజారెడ్డి

శ్రీరాంపూర్: కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో గెలిచిన సంఘాలు విఫలమయ్యాయని సీఐటీయూ కేంద్ర కమిటీ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి ఆరోపించారు. గురువారం ఆర్కే 7 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహించడం లేదని, ఇన్వాలిడేషన్ అయిన వారి స్థానంలో డిపెండెంట్లకు కారుణ్య ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. కార్మికుల సమస్యలపై కొట్లాడటానికి వేదికలైన స్ట్రక్చర్ సమావేశాలు బహిష్కరించి ఇక్కడ గనులపై మెమోరాండాలు ఇస్తూ కార్మికులను అయోమయానికి గురిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచి అధ్యక్షుడు గుల్ల బాలాజీ, రాష్ట్ర కమిటీ సభ్యుడు కస్తూరి చంద్రశేఖర్, నాయకులు వెంగళ కుమారస్వామి, వెంకట్‌రెడ్డి, సమ్మయ్య, ప్రవీణ్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవర ఆలయంలో చోరీ


ఆలయంలో పరిశీలిస్తున్న సీఐ వేణుచందర్

భీమారం: మండల కేంద్రంలోని లక్ష్మీదేవర ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ముదిరాజ్ సంఘం పెద్దలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సమీపంలోని పత్తి చేను మీదుగావచ్చిన దుండగులు మొదట ఆలయం తలుపులు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. హుండీలో ఉన్న 4 కిలోల 500గ్రాములు వెండి, రూ. 36 వేల నగదు, అమ్మవారిపై ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆలయంలో ఇంత పెద్దఎ త్తున వెండి ఉందన్న సమాచారం దొంగలకు ఎలా చేరిందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మందు పార్టీ చేసుకుని దోపిడీ

చోరీకి పాల్పడిన దొంగలు మొదట సమీపంలోని పత్తి చేనులో మందు పార్టీ చేసుకున్నట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. పథకం ప్రకారం మొదట ఆలయ పరిసర ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించినట్లు తెలుస్తోంది. ఆలయం ఎదుటే నివాస గృహాలు ఉన్నప్పటికీ దుండగులు దోచుకుని యథేచ్ఛగా వెళ్లి పోవడం వెనుక స్థానికులు ఎవరైనా వారికి సహకరించారా? అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

500 మీటర్ల దూరంలోనే పోలీస్‌స్టేషన్

పోలీస్‌స్టేషన్‌కు కేవలం 500 మీటర్ల దూరంలోనే చోరీ, జాతీయ రహదారికి సమీపంలోనే చోరీ జరగడం మండలంలో సంచలనంగా మారింది.


సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీఐ


సంఘటన స్థలాన్ని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ గురువారం సందర్శించి స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. డాగ్‌స్క్వాడ్‌తో పరిసరాలు గాలించగా అది పత్తిచేనులోకి వెళ్లి ఆగిపోయింది. నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు.

ట్రయల్ పేరిట బైక్..

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని భుక్తాపూర్‌కు చెందిన సయ్యద్ రఫీక్ అటో కన్సల్టెన్సీ టూవీలర్ పర్చేజ్ అండ్ సేల్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. బుధవారం బైక్ కొనుగోలు చేసేందుకు వచ్చిన ఓ వ్యక్తి ట్రయల్ కోసం బండిని కొంతదూరం వరకు తీసుకెళ్లి తిరిగి రాలేదు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు గురువారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

పశువులను తరలిస్తున్న లారీ పట్టివేత


పట్టుబడిన లారీతో పోలీసులు


మృతి చెందిన పశువులు

బోథ్: మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు పశువులను తరలిస్తున్న లారీని గురువారం సోనాల మండలంలోని ఘన్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు పోలీసులు ఘన్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహించగా అనుమానాస్పదంగా ఉన్న లారీని ఆపి పరిశీలించగా అందులో పశువులు కనిపించాయి. లారీలో 26 పశువులు ఉండగా రెండు మృతి చెంది ఉన్నాయి. వాహనాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న పశువులను బజార్‌హత్నూర్‌లోని గోశాలకు తరలించినట్లు ఎస్సై శ్రీసాయి పేర్కొన్నారు. లారీ ఓనర్‌తో పాటు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.